సాక్షి సంగారెడ్డి
శుక్రవారం । 14 । జూలై । 2023



ప్రయోగాత్మకం.. ఆలు సాగు

వర్షాకాలంలో ఆలు పంట సాగు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ మండలం రంజోల్‌లో నారును నాటారు. 8లో



గొల్లకురుమ అభివృద్ధికి పెద్దపీట

గొల్లకురుమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం మల్గిలో గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. 9లో

15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అలాగే ఆర్టీపీసీఆర్ టెస్టులు 10 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం

సంగారెడ్డి టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ ఎన్నికల కమిషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని అందోల్, నారాయణ ఖేడ్, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీఓలు, పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ నియమితులయ్యారు. అలాగే తహసీల్దార్లను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించారు.

శాకంబరీగా వాసవీ అమ్మవారు



విశేష అలంకరణలో అమ్మవారు

సంగారెడ్డి టౌన్: ఆషాడ మాసం పరిష్కరించుకొని పట్టణ శివారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని గురువారం శాకంబరీగా అలంకరించారు. అమ్మవారికి వివిధ ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించారు. కృత్తికా నక్షత్రం పురస్కరించుకొని దేవాలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు జరిపించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఆపై లలిత సహస్ర పారాయణం గావించారు. అమ్మవారికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధానకార్యదర్శి రాజు, కోశాధికారి మల్లేశం, కార్యనిర్వాహక కార్యదర్శి విద్యాసాగర్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కోశాధికారి ప్రకాష్, మహిళా సంఘం సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తోపాజి తేజావతి తదితరులు పాల్గొన్నారు.

15న బీసీల రాజకీయ ప్లీనరీ



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఈనెల 15న హైదరాబాద్.. ఎల్బీనగర్‌లో ఉన్న కేబీఆర్ కన్వెన్షన్‌లో బీసీల రాజకీయ ప్లీనరీని నిర్వహిస్తామని ఓడీఎఫ్ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి తాటిపల్లి పాండు తెలిపారు. గురువారం ప్లీనరీ వాల్ పోస్టర్లను పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీసీలు రాజకీయంగా అనుసరించవలసిన విధానంపై చర్చించి, భవిష్యత్ రాజకీయ కార్యాచరణ ప్రకటించడానికి.. ఈ ప్లీనరీ 10 వేల మంది బీసీ ప్రతినిధులతో నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం టికెట్లు ఇస్తామని చెప్పకుండా రాయితీలు, సంక్షేమ పథకాలతో 'బీసీ డిక్లరేషన్' ప్రకటనల అంటూ రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు మోసం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుకూరి జగదీశ్వర్, జిల్లా కన్వనర్ రమేశ్, నాయకులు రవి, శ్రీకాంత్, హరీశ్, జైపాల్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని 20 మండలాల్లో ఖాళీగా ఉన్న 227 ఫిజియోథెరపీ పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. అభ్యర్థులు నాలుగున్నరేళ్ల బీపీటీ కోర్స్ చదివి ఉండాలని, స్టేట్ పారామెడికల్ బోర్డు నుంచి రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం కలెక్టరేట్లో ఈనెల 18వ తేదీ లోగా సమర్పించాలని సూచించారు. వివరాలకు 94915 66943 నంబర్‌లో సంప్రదించాలని వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

తెగని ఖేడ్ పంచాయితీ

చిచ్చు రాజేసిన మండలాధ్యక్షుల నియామకం

- హస్తినలోని ఏఐసీసీ ముఖ్యనేతలకు సంజీవరెడ్డి వర్గం ఫిర్యాదు
- షెట్కార్ వర్గానికే పోస్టులన్నీ దక్కాయని ఆరోపణ
- నేడో రేపో గాంధీ భవన్ ముట్టడికి సన్నాహం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: నారాయణఖేడ్ నియోజకవర్గం కాంగ్రెస్‌లో నెలకొన్న వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఇటీవల ప్రకటించిన నియోజకవర్గంలోని పార్టీ మండల అధ్యక్ష పదవుల పంచాయితీ ఏకంగా హస్తినకు చేరింది.

- పార్టీ కీలకమైన ఈ పదవులు ఏకపక్షంగా నియమించారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేశారు.
- ఏఐసీసీ అగ్రనేతలు రోహిత్‌చౌదరి, ఠాక్రేలను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.
- ఇక్కడ మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్‌కు, డాక్టర్ సంజీవరెడ్డికి మధ్య ఆధిపత్య పోరు ఏళ్లుగా కొనసాగుతోంది.
- తాజాగా మండల అధ్యక్ష పదవుల విషయంలో మరోమారు బయటపడింది. మండలాధ్యక్ష పదవులన్నీ షెట్కార్ వర్గానికే దక్కడం వివాదాస్పదంగా మారింది.
- నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షుడితోపాటు, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మల్లురవి పేరుతో ఉత్తర్వులు వచ్చాయి.
- ఈ పదవుల నియామకాలు ఏకపక్షంగా జరిగాయంటూ సంజీవరెడ్డి వర్గం భగ్గుమంటోంది.
- పార్టీ రాష్ట్ర నాయకత్వం కనీసం తమతో సంప్రదించకుండానే నియోజకవర్గంలో కీలకమైన పదవులు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తోంది.
- దీన్ని నిరసిస్తూ టీపీసీసీ నాయకులకు ఫిర్యాదు చేసిన సంజీవరెడ్డి ఓ అడుగు ముందుకేసి ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేయడం ఆ పార్టీ ముఖ్యనేతల్లో చర్చకు దారితీసింది.

గతంలో సభ్యత్వ విషయంలోనూ

- 6 నెలల క్రితం కాంగ్రెస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టింది. దేశవ్యాప్తంగా డిజిటల్ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టింది.
- ఈ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ కూడా కొద్ది నెలల క్రితం రచ్చకు దారితీయడం తెలిసిందే.
- ఈ డిజిటల్ సభ్యత్వాల నమోదు కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో యాక్సిస్ కోసం ఇద్దరు నాయకులు అప్పట్లో గొడవ పడ్డారు. దీంతో టీపీసీసీ నాయకత్వం కలుగజేసుకుంది.
- ఇక్కడ సుమారు 38 వేల సభ్యత్వాలు నమోదు చేశారు. ఇందులో 90 శాతానికి పైగా సభ్యత్వాలు తామే చేయించామని, సంస్థాగతంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నా తమను సంప్రదించకుండా షెట్కార్ వర్గానికి ఈ పదవులు ఇవ్వడం ఏమిటని సంజీవరెడ్డి వర్గం ప్రశ్నిస్తోంది.
- కాంగ్రెస్ పార్టీ వీడి తిరిగి వచ్చిన సంజీవరెడ్డికి ఎలా ప్రాధాన్యత ఇస్తారని షెట్కార్ వర్గం వాదిస్తోంది. దీనిపై టీపీసీసీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో సంజీవరెడ్డి ఏకంగా హస్తిన వెళ్లి ఫిర్యాదు చేశారు.

మరోసారి ముట్టడికి నిర్ణయం?

మండల అధ్యక్ష పదవుల నియామకం విషయంలో సంజీవరెడ్డి వర్గం గాంధీభవన్‌ను ముట్టడించాలని నిర్ణయించింది. రెండు మూడు రోజుల్లో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే హైదరాబాద్ రానున్న నేపథ్యంలో సంజీవరెడ్డి వర్గం నేతలు గాంధీభవన్ వద్ద నిరసన తెలపాలని భావిస్తున్నారు. ఇప్పటికే మెదక్, సిద్దిపేట డీసీసీ అధ్యక్షులను పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్, మెదక్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఇటీవల గాంధీభవన్ ముట్టడించిన విషయం తెలిసిందే. తాజాగా ఖేడ్ కాంగ్రెస్ శ్రేణుల్లో సంజీవరెడ్డి వర్గం గాంధీభవన్ వేదికగా నిరసన తెలపాలని భావిస్తోంది.

15 నుంచి రూ.'లక్ష' సాయం

సంగారెడ్డి టౌన్: ఈనెల 15 నుంచి బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం కింద లక్ష రూపాయల చెక్కుల పంపిణీ ప్రారంభమవుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ నుంచి బీసీ కులవృత్తులు, చేతివృత్తులకు లక్ష ఆర్థిక సాయం పథకం అమలుపై మంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ, జిల్లాలో లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం 20,894 దరఖాస్తులు వచ్చాయని, ప్రాధాన్యత పరంగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టంచేశారు. కాన్ఫరెన్స్ లో కలెక్టర్ డాక్టర్ శరత్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, ఎంపీడీఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆన్‌లైన్ పెండింగ్ మొత్తం రేపటిలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓలను, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

చెట్లే జీవనాధారం



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎస్పీ రమణకుమార్, అధికారులు

ఎస్పీ రమణకుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: మానవజాతి మనుగడకు మొక్కలే జీవనాధారమని ఎస్పీ ఎం.రమణకుమార్ అన్నారు. అలాంటి మొక్కలను నాటి భావి తరాలవారికి స్వచ్ఛమైన గాలి అందించాలన్నారు. హరితహారంలో భాగంగా ఎస్పీ తన కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనీసం ఒక్కో మొక్క నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కడైతే పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. అక్కడే వారి ఆలోచన విధానం మారుతుందన్నారు. భూమిపై పశుపక్షాదుల నివాసం చెట్లేనని, మానవుడి నిత్య జీవితంలో చెట్ల పాత్ర ఎంతో ఉందన్నారు. హరితహారంలో 286 మొక్కలు నాటామని స్పష్టం చేశారు. సంగారెడ్డి డీఎస్పీ రవీంద్రారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ, ఏఆర్ డీఎస్పీ జనార్దన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ ఆర్ఐలు, సంగారెడ్డి సబ్‌డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వంటావార్పు



శిబిరంలో జీపీ కార్మికులు

కంది(సంగారెడ్డి): సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా కందిలో జీపీ కార్మికులు గురువారం వంటావార్పు చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులను పర్మనెంట్ చేయాలని వారంరోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కష్టపడి పని చేసి గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు కనీస వేతనాలకు దిక్కులేదన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులను అధికారులు, ప్రభుత్వం తొలగిస్తామని బెదిరిస్తున్నదని విమర్శించారు. కారోబార్, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను సహాయ కార్యదర్శులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలోయూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, నాయకులు మల్లేశం సుదర్శన్ కార్మికులు సతీష్, నాగరాజు, కుమార్, లక్ష్మి, దుర్గయ్య, గోవర్ధన్, హనుమంతు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డి అన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన భూపాల్‌రెడ్డిని గుమ్మడిదల మాజీ సర్పంచ్ ఇందెల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. గ్రామాల్లోని ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని భూపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భూపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అందరికీ ప్రాధాన్యమిస్తాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పార్టీలోని ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటామని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని దోమడుగుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరేందుకు ముందుకొస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ రాజశేఖర్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, మంగయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన

సంగారెడ్డి అర్బన్: రాష్ట్ర ఉపాధి శిక్షణ డైరెక్టరేట్, నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రెస్‌క్లబ్‌లో యువత నైపుణ్య శిక్షణ ఉపాధి అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన కార్యక్రమం ప్రారంభించి, నైపుణ్యాభివద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ బాలకష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ప్రపంచస్థాయి గుర్తింపు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్



మధును సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: తమ హయాంలో బోనాలకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని గోనెమ్మబస్తీలో ఉన్న అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవంలో, ముదిరాజ్ భవన్ సమీపంలో పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధు ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం దేవాలయాల వద్ద బోనాల మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లూ చేసిందన్నారు. పండగలకు అధికార హోదా కల్పించడంతోనే ఇది సాధ్యమైందన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను బోనం ఎత్తుకున్న మహిళలందరూ దీవించాలని కోరారు. మరిన్ని సంక్షేమాలు ప్రవేశపెట్టి ప్రజలకు అండగా ఉండేది ముఖ్యమంత్రి కేసీఆర్‌యేనని అన్నారు. తొలుత పోచమ్మ బోనాల మహోత్సవ నిర్వాహకులు నీలం మధు ముదిరాజ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉప్పరీ నర్సింలు, మెట్టు కృష్ణ, తులసీదాస్, అశోక్, మేకల రాజు, మనోజ్, సందీప్, రాజు, రమేశ్, నవీన్, జాతర నిర్వాహకులు ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

గానుగపూర్‌కు ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి టౌన్: కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ దత్తాత్రేయ క్షేత్రమైన గానుగపూర్‌కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని రీజినల్ మేనేజర్ సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న అమావాస్యను పురస్కరించుకొని జహీరాబాద్ నుంచి ఉదయం 6.30, 8.30లకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పెద్దలకు రూ. 210, పిల్లలకు 120 చార్జీలుంటాయని తెలిపారు.

16,459 మందికి అవకాశం



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయి సహాయ సంచాలకుడు భిక్షపతి

ఏడీఏ భిక్షపతి

న్యాల్‌కల్(జహీరాబాద్): నియోజకవర్గంలోని 16,459 మంది రైతుబీమా చేసుకునేందుకు అవకాశం ఉందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకుడు భిక్షపతి సూచించారు. గురువారం మండలపరిధిలోని న్యామతాబాద్‌లో రైతుబీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్‌లో 2,564 మంది, ఝురాసంగంలో 3,095, కోహీర్‌లో 3,007, జహీరాబాద్ మండలంలో 4,395 మంది రైతులు బీమా చేసుకునేందుకు అర్హులన్నారు. బీమా చేసుకునేందుకు రైతు 2023 జూన్ 18 లోపు భూమి రిజిస్ట్రేషన్ చేసుకొని, 18 నుంచి 59 ఏళ్లు నిండి ఉండాలన్నారు. అర్హులైన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లతోపాటు సమీపంలోని ఏఈఓల ద్వారా బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీమా చేసుకున్న రైతు మరణిస్తే వారి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిలు, పాండుపటేల్, నర్సింహులు, సంగప్ప, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఊరేగింపు



పటాన్‌చెరులో..



ఊరేగింపులో ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): మండలంలో ఉన్న చింతలచెరువులో బీఆర్ఎస్ జిల్లా కార్మిక విభాగం ఉపాధ్యక్షుడు అర్జున్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల ఊరేగింపులో గురువారం ఎమ్మెల్యే మదన్ రెడ్డి పూజలు నిర్వహించారు.

- మండలంలోని కాసాల, బోరపట్ల, గుండ్లమచినూర్, చింతల్చెరు, గోవిందరాజుపల్లి, దేవులపల్లి గుండ్లమాచినూరు, బ్రాహ్మణగూడ, నవాబుపేట తదితర గ్రామాల్లో బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామసర్పంచ్‌లు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని గోకుల్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి బోనాల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్ పాల్గొన్నారు. యాదవ బస్తీ నుంచి ఏడు గుళ్లపోచమ్మ దేవస్థానం వరకు మహిళలతో కలిసి బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లారు.

- డివిజన్ పరిధిలోని బండ్లగూడలో బోనాల పండగ నేపథ్యంలో అమ్మవారిని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, జిల్లా కార్యవర్గసభ్యుడు మధుకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అసెంబ్లీ కన్వీనర్ రాజుగోపాల్ యాదవ్, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు ధన్‌రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ సంగమేశ్ తదితరులు దర్శించుకున్నారు.

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి అవకతవకలపై విచారణ



విచారిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్‌): పెళ్లి జరిగిన రోజును మార్చి కల్యాణలక్ష్మి డబ్బులు తీసుకున్న విషయంలో పెద్దశివునూర్‌ గ్రామంలో గురువారం మండల ప్రత్యేక అధికారి జయరాజ్‌ విచారణ జరిపారు. గ్రామానికి చెందిన మనెగల్ల ఎల్లం కూతురు మానస వివాహం 2017, ఫిబ్రవరి 15న జరిపించారు. అప్పటికి మానస మైనర్‌ కావడంతో 2000, ఫిబ్రవరి 26న పెళ్లి జరిగినట్లు వివాహ పత్రికను సృష్టించి కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కల్యాణలక్ష్మి డబ్బులు మంజూరయ్యాయి. ఇది తెలిసిన కొందరు తప్పుడు పత్రాలతో కల్యాణలక్ష్మి డబ్బులు మంజూరు చేయించుకున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ విషయం తెలుసుకున్న మండల ప్రత్యేక అధికారి జయరాజ్‌ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ నర్సింగ్‌ యాదవ్‌లు గ్రామ పంచాయతీలో విచారణ జరిపి పలువురి వాగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌ రాజర్షిషాకు పంపించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ప్రత్యేక అధికారి జయరాజ్‌ పేర్కొన్నారు. విచారణలో సర్పంచ్‌ రుక్మిణీభాయి జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్‌తో పాటు ఎల్లం కుటుంబీకులు స్థానికులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రమేశ్‌

గజ్వేల్‌రూరల్‌: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్‌ ఏసీపీ రమేశ్‌ సూచించారు. సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ శ్వేత సూచనల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలలో గురువారం సీఐ వీర ప్రసాద్‌తో కలిసి మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్‌ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్‌ మాట్లాడుతూ విద్యార్థినులు ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. సోషల్‌ మీడియాకు దూరంగా ఉండి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. నేరాలు జరిగిన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. షీటీమ్‌ విధులు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్‌, సైబర్‌ క్రైమ్స్‌, గుడ్‌ అండ్‌ బ్యాడ్‌ టచ్‌, మైనర్‌ డ్రైవింగ్‌, సమాజ రుగ్మతలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు ఏవైనా ఇబ్బందులకు గురైతే 100 లేదా షీటీమ్‌ (8712667343), స్నేహిత మహిళాసపోర్ట్‌ సెంటర్‌(9494639498), మహిళా పోలీస్‌ స్టేషన్‌(8712667435)లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ శశికళ, గజ్వేల్‌ షీటీమ్‌ ఏఎస్‌ఐ అమృత్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ సంజీవరెడ్డి, కానిస్టేబుళ్లు యుగేందర్‌, అన్వేష్‌, మహిళా కానిస్టేబుల్‌ జ్యోతి, కళాశాల అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని పాడిగేదె మృతి



గేదె కళేబరం

శివ్వంపేట(నర్సాపూర్‌): ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో పాడిగేదె మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పట్నం నర్సింలు వ్యవసాయ సాగుతో పాటు పశుపోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజువారిగానే తన పశువులను మేతకు తీసుకెళ్లాడు. మేత మేసిన అనంతరం పశువులను గ్రామానికి తీసుకొస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు పాడి గేదెను ఢీకొంది. ఈ ఘటనలో పాడి గేదె మృతి చెందింది.

గాయపడ్డ నెమలికి చికిత్స

నారాయణఖేడ్‌: రోడ్డుప్రక్కన గాయాలతో పడి ఉన్న ఓ నెమలిని యువకుడు రక్షించి చికిత్స చేయించి అటవీశాఖ అధికారులకు అప్పజెప్పాడు. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్‌ మండలం వెంకటాపూర్‌ తండాకు చెందిన యువకుడు మోహన్‌ గురువారం సాయంత్రం మోటారుసైకిల్‌పై నారాయణఖేడ్‌కు వస్తుండగా రోడ్డుపక్కన ఓ నెమలి గాయమై కనిపించింది. దీన్ని గమనించిన మోహన్‌ దాన్ని తీసుకొచ్చి ఖేడ్‌ పశువైద్యశాలలో చికిత్స చేయించాడు. అనంతరం స్థానిక అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. మోహన్‌ను అటవీశాఖ సిబ్బంది అభినందించి. అది పూర్తిగా కోలుకున్నాక అడవిలో వదిలేస్తామని అధికారులు తెలిపారు.

ప్రయోగాత్మకం.. ఆలు సాగు

వర్షాధారం కింద పంట
- ఏ మేరకు వస్తుందనే దానిపై పరిశీలన
- రంజోల్‌లో ఎకరం పొలంలో నాటిన ఆలుగడ్డ నారు
- బెంగుళూరు నుంచి తీసుకొచ్చిన మొక్కలు



బొప్పాయిలో అంతర పంటగా సాగు చేసిన ఆలు

జహీరాబాద్‌: వర్షాకాలంలో ఆలు పంట సాగు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టారు. గురువారం జహీరాబాద్‌ మండలంలోని రంజోల్‌ గ్రామంలో అపైకల్‌ రూట్‌ కటింగ్‌ విధానంలో పెంచిన నారును పొలంలో నాటారు. గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి వద్ద అర ఎకరం, జగన్నాథ్‌రెడ్డి వద్ద మరో అర ఎకరంలో ఆలు నారు మొక్కలను నాటారు. కర్ణాటక రాష్ట్రం, బెంగుళూరులోని హసన్‌ ప్రాంతంలో ఉన్న ల్యాబ్‌లో ఎఫ్‌ఓ హైబ్రీడ్‌ కుఫ్రీ హిమాలిని ఆలుగడ్డ నారు మొక్కలను పెంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి రైతులు గ్రామానికి తెచ్చుకుని నాటారు. సెంట్రల్‌ పొటాటో ఇనిస్టిట్యూట్‌ తరఫున రైతులకు ఉచితంగా ఆలుగడ్డ నారు మొక్కలను సరఫరా చేశారు. ఇండోనేషియా టెక్నాలజీలో గ్రాఫ్‌ను డెవలప్‌చేసి దాని ఆధారంగా పొటాటో ఇనిస్టిట్యూట్‌లో ఏఆర్‌సీ విధానంలో ఆలు మొక్కలను పెంచి సాగుకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం బెంగుళూరు ప్రాంతంలో వర్షాకాలంలో సాగు చేస్తున్న ఆలుగడ్డ పంట మంచి ఫలితాలనిస్తుంది. మొదటి సారిగా జహీరాబాద్‌లో మూడు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఎకరం భూమిలో సాగును పూర్తి చేశారు. మరో రెండెకరాల్లో సాగు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎకరం పొలంలో 30వేల మొక్కలు అవసరం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక్కో మొక్క ఖరీదు రూ.3లు ఉందన్నారు. ఇంత ఖరీదైనది కావడంతో రైతులకు సాగు భారం అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఏఆర్‌సీ విధానాన్ని విస్తృతం చేస్తే తక్కువ ఖర్చుతో మొక్కలు లభ్యమయ్యే అవకాశం ఉంటుందంటున్నారు. వర్షాకాలంలో సాగు చేసుకునే ఆలుగడ్డ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్‌ ఉంటుంది. అన్‌ సీజన్‌ కావడమే ఇందుకు కారణం. ప్రస్తుతం యాసంగిలో సాగుచేస్తున్న ఆలుగడ్డ పంటకు నల్ల మచ్చల తెగుళ్లు, వైరస్‌ తెగుళ్లు అధికంగా సోకుతున్నందునా పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందునా రైతులకు గిట్టుబాటు కావడం లేదనే ఉద్దేశ్యంతో నారు విధానంలో ఆలు మొక్కలను ప్రోత్సహించేందుకు చేస్తున్న ప్రయత్నమని చెబుతున్నారు.



నారును పరిశీలిస్తున్న రైతులు



నాటేందుకు నారును తీసుకెళ్తున్న కూలీ

ఏమేరకు ఫలితం ఉంటుందనేదానిపై దృష్టి..

ప్రస్తుతం వర్షాకాలంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఆలుగడ్డ పంట దిగుబడులు ఏమేరకు ఉంటాయనే దానిపై ఉద్యానవన శాఖ దృష్టి పెట్టింది. జూన్‌, జూలైలో సాగు చేయడం ద్వారా సెప్టెంబర్‌లో పంట చేతికి వస్తుందని భావిస్తున్నారు. ఇలా వచ్చిన పంటలో నాణ్యమైన పంటను మార్కెట్లో విక్రయించుకుని, మిగిలిన చిన్న చిన్న దుంపలు, పచ్చ దుంపలను యాసంగిలో విత్తనంగా వినియోగించుకోవచ్చనే విషయమై పరిశీలిస్తున్నారు. యాసంగిలో చలి అధికంగా ఉండడంతో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. వర్షాకాలంలో వాతావరణం ఏమేరకు అనుకూలంగా ఉంటుందనేది కూడా ప్రయోగంలో తెలుస్తుంది. కుఫ్రీ హిమాలిని రకం ఇక్కడి వాతావరణం, నేలలకు ఎంత మేర ఉపయోగకరంగా ఉంటుందనే దానిపై అధ్యాయనం చేస్తున్నారు. ప్రతి ఏటా రైతులు యాసంగిలో మాత్రమే ఆలుగడ్డ పంటను సాగు చేసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా ప్రాంతం నుంచి విత్తనాన్ని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

అంతర పంటగా వేశాను..



ఉద్యానవన శాఖ ఉచితంగా ఆలుగడ్డ నారు మొక్కలను అందజేసింది. దీంతో ప్రయోగాత్మకంగా అర ఎకరంలో 11వేల మొక్కల వరకు సాగు చేశాను. ప్రస్తుతం బొప్పాయి పంట సాగులో ఉంది. అందులోనే అంతర పంటగా వేశాను. పంట బాగా వస్తే భవిష్యత్తులో రైతులు ఈ విధానంలో సాగు చేసే అవకాశం ఉంది. వర్షాకాలంలో కూడా ఈ ప్రాంతంలో విస్తారంగా సాగుకు బీజం పడుతుంది.

–నల్ల నాగేశ్వర్‌రెడ్డి, రైతు, రంజోల్‌

ప్రయోగం మాత్రమే



ప్రస్తుతం ఆలుగడ్డ మొక్కలను ప్రయోగాత్మకంగానే సాగు చేయిస్తున్నాం. బెంగుళూరు ప్రాంతంలో మంచి ఫలితాలనిస్తున్నందునా సెంటర్‌ పొటాటో ఇనిస్టిట్యూట్‌ తరఫున కుఫ్రి హిమాలిని అనే రకం ఆలును వర్షాధారంగా సాగు చేయిస్తున్నాం. అవసరమనుకుంటే నీటిని అందించాల్సి ఉంటుంది. ఇది విజయవంతం అయితే సాగును ప్రోత్సహిస్తాం.

–అనూషరెడ్డి, ఉద్యానవన అధికారి, జహీరాబాద్‌

భక్తి శ్రద్ధలతో బోనాలు



నర్సాపూర్‌లో ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్‌: నర్సాపూర్‌ పట్టణ ప్రజలు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం ఫలహార బండ్లు ఊరేగించారు. బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే చిలుములమదన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ మురళీయాదవ్‌, తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు మెదక్‌ పార్లమెంటు ఇన్‌చార్జ్‌ గాలి అనిల్‌కుమార్‌ తదితరులు ఆలయాల్లో పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫలహార బండ్ల ఊరేగింపులో హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయాలు, ఫలహార బండ్ల నిర్వాహకులు ఆయా పార్టీల నాయకులను శాలువా కప్పి సన్మానించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కొమురయ్య మృతదేహం

కొండపాక(గజ్వేల్‌): విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలంలోని తిప్పారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమురయ్యకు తనకున్న వ్యవసాయ భూమితో పాటు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ ఆకుల భద్రప్ప వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న వ్యవసాయ పొలం వద్ద బోరు మోటార్‌కు విద్యుత్తు సరఫరా కాకపోవడంతో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద వైర్‌ను సరి చేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై ఇరుసాల కొమురయ్య మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపారు.

జీవితంపై విరక్తితో ఇద్దరి ఆత్మహత్య

మెదక్‌ మున్సిపాలిటీ: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కలాన్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన బాగిర్థిపల్లి కళావతి సిద్దిరాంలు పెద్ద కుమారుడైన భాగిర్థిపల్లి రాజు(35) గత కొంతకాలంగా మెదక్‌పట్టణంలోని నర్స్‌ఖేడ్‌ వీధిలో నివాసం ఉంటున్నాడు. 2017లో కొంతంపల్లి గ్రామానికి చెందిన పోచమ్మతో పెళ్లి జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా పోచమ్మ రాజును వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయంలో తరచూ బాధపడుతు ఉండేవాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రాజు స్థానిక మల్లెం చెరువు ఒడ్డున చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుని తల్లి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పోచయ్య పేర్కొన్నారు.

జహీరాబాద్‌లో..



వెంకటేశ్వర్‌ (ఫైల్‌)

జహీరాబాద్‌: మనోవేదనకు గురై యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ..కాశీంపూర్‌ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌(27) ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగం రాలేదు. దీంతో హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో కరోనా సమయంలో గ్రామంలోనే ఉండిపోయి ప్రభుత్వ ఉద్యోగం రాలేదని మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం గ్రామంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

హత్యకేసులో ఆరు సంవత్సరాల జైలు

పటాన్‌చెరు టౌన్‌: హత్యకేసులో ఓ వ్యక్తికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష విధించిన సంఘటన భానూర్‌–బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అస్సాం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి పాశమైలారం పారిశ్రామికవాడలో పనిచేసుకుంటూ అద్దె రూంలో బిశ్వేర్‌ బోరా, బుపెన్‌బోరాలు ఉంటున్నారు. ఈ క్రమంలో 2020, సెప్టెంబర్‌, 13 తేదీన రూమ్‌లో గొడవ జరిగి బుపెన్‌బోరాను బిశ్వేర్‌ బోరా హత్యచేశాడు. అప్పట్లో బీడీఎల్‌ సీఐ రాంరెడ్డి నిందితుడు బిశ్వేర్‌ బోరను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గురువారం వాదోపవాదాలు విన్న నాలుగో అడిషనల్‌ సెషన్‌ కోర్టు న్యాయమూర్తి లావణ్య నిందితుడైన బిశ్వేర్‌ బోరాకు ఆరు సంవత్సరాల జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

సైబర్‌ వలలో ప్రైవేట్‌ ఉద్యోగి..

పటాన్‌చెరు టౌన్‌: వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్‌ ఉద్యోగి రూ.7.90లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండల పరిధిలోని ఘణపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్‌ ఉద్యోగికి జూన్‌ 8వ తేదీన వాట్సాప్‌కు ఓ మెసేజ్‌ వచ్చింది. దీనికి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో బాధితునికి గిఫ్ట్‌ వచ్చిందని చెప్పి నమ్మించాడు. బాధితుడు ముందుగా రూ.4వేలు చెల్లించాడు. అనంతరం గిఫ్టలు గోల్డ్‌సెట్‌, ఐఫోన్‌, ట్యాబ్‌, బంగారు గాజులతో పాటు రూ.16 లక్షల నగదు ఎయిర్‌ పోర్ట్‌కు వచ్చాయని, వాటికి ట్యాక్స్‌ కట్టాలని పలు దఫాలుగా సైబర్‌ నేరగాళ్లు బాధితుడి నుంచి రూ.7,90,000లు చెల్లించాడు. ఇంకా నగదు చెల్లించాలని అడగడంతో అనుమానం వచ్చిన బాధితుడు తను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం భానూర్‌–బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పెళ్లి విషయంలో తండా వాసుల ఘర్షణ

శివ్వంపేట(నర్సాపూర్‌): యువతిని ప్రేమించిన యువకుడితో పెళ్లి జరిపించే విషయంలో తండా వాసులు ఘర్షణ పడ్డారు. ఓ తండాకు చెందిన యువతిని మరో తండాకు చెందిన యవకుడు ప్రేమించాడనే విషయం ఇంట్లో తెలియడంతో యువతిని 4 నెలల క్రితం మరో వ్యక్తితో పెళ్లి జరిపించారు. గత కొన్నాళ్ల నుంచి పెళ్లయిన యువతిని ప్రేమించిన వ్యక్తి ఫోన్‌ సంభాషణ చేస్తూనే పాటు పాత ఫోటోలు పెట్టాడు. ఈ విషయం భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులకు తెలియడంతో యువతిని పుట్టింటికి పంపించేశారు. ఈ విషయంపై ఇరు తండావాసుల పెద్దలు రెండు రోజుల క్రితం పంచాయితీ పెట్టారు. పెళ్లి చేసుకున్న వ్యక్తితో ప్రేమ వ్యవహారం గొడవకు దారితీసినందునా యువతిని ప్రేమించిన యువకుడు పెళ్లి చేసుకోవాల్సిందిగా ఇరు తండా పెద్దలు నిర్ణయించారు. అందుకు యువకుడు సైతం ఒప్పుకున్నాడని మరుసటి రోజు పెళ్లి చేసుకోనని మాటమార్చడంతో ప్రేమ వ్యవహారం పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. గురువారం ఇరు తండావాసులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గొడవ పడ్డారు. మరోమారు ఇరు తండా పెద్దలు పోలీస్‌స్టేషన్‌లో చర్చించినప్పటికి కొలిక్కి రాలేదు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిపై కొడుకు దాడి

చికిత్స పొందుతూ మృతి



రాజయ్య మృతదేహం

నంగునూరు(సిద్దిపేట): భూమి విషయమై జరిగిన గొడవలో తండ్రిపై కొడుకు దాడి చేయగా చికిత్స పొందుతూ తండ్రి మృతి చెందిన సంఘటన ఘణపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..నంగునూరు మండలం ఘణపూర్‌ గ్రామానికి చెందిన ఎర్రవెల్లి రాజయ్య (65) భార్య కనకవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రవి వ్యవసాయం చేస్తూ గ్రామంలో నివసిస్తుండగా చిన్నకుమారుడు రాజమల్లు బతుకు దెరువు కోసం సిద్దిపేట వెళ్లాడు. బుధవారం రాత్రి తండ్రితో కలసి మద్యం సేవించిన రవి వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చే విషయమై తండ్రితో గొడవ పడి కర్రతో కొట్టాడు. ఈ ఘటనలో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాజయ్య మృతి చెందాడు. చిన్న కుమారుడు రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజుగౌడ్‌ తెలిపారు.

రెండు ఇళ్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

మనూరు(నారాయణఖేడ్‌): నాగల్‌గిద్ద మండలం మేఘ్యానాయక్‌ తండాలో గురువారం మధ్యాహ్నం రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన బానోత్‌ సుకులాల్‌, బానోత్‌ నరేందర్‌లకు చెందిన రెండు ఇళ్లు దగ్ధం కాగా స్థానికులు అప్రమత్తమయ్యి మంటలను ఆర్పారు. అప్పటికే ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు, ధాన్యం పూర్తిగా కాలిపోయాయి. సుకులాల్‌ ఇంట్లో రూ.5లక్షల నగదు, నరేందర్‌ ఇంట్లో తులం బంగారం, 15తులాల వెండి, బట్టలు కాలిపోయాయని తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణం షాట్‌ సర్క్యూట్‌ ఉండొచ్చని తండావాసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా తహసీల్దార్‌ కిషన్‌ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించి వివరాలు సేకరించారు. కాగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కల్వర్టును ఢీకొట్టిన ప్రైవేట్‌ స్కూల్‌ బస్సు



కల్వర్టును ఢీకొట్టిన స్కూలు బస్సు

వటప్‌పల్లి(అందోల్‌): ప్రైవేట్‌ స్కూల్‌ బస్సు బ్రేకులు ఫెయిల్‌అయి కల్వర్టును ఢీకొట్టిన ఘటన గురువారం పోతులబోగుడా గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వటప్‌పల్లి అక్షర పాఠశాల స్కూల్‌ బస్సు గురువారం ఉదయం చేవెళ్ల పోతులబోగుడా గ్రామాల నుంచి పిల్లలను పాఠశాలకు తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో బస్సు బ్రేకులు ఫెయిల్‌అయి అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసమవడంతో పాటు అద్దాలు పగిలాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు వాపోయారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి పూజారి మృతి



సత్యనారాయణచార్యుల మృతదేహం

సిద్దిపేటకమాన్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన పూజారి ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో పడి మృతి చెందాడు. సిద్దిపేట వన్‌టౌన్‌ సీఐ బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం..మరిగంటి సత్యనారాయణచార్యులు(51) పూజారిగా విధులు నిర్వహిస్తూ గణేష్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల11వ తేదీన ఇమాంబాద్‌ గ్రామ శివారులో పూజ ఉందని ఇంట్లో వాళ్లకి చెప్పి బయటకు వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ క్రమంలో ఇమాంబాద్‌ శివారులోని కాల్వలో గురువారం గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని మృతుడి ఫొటోలను సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు వాట్సాప్‌ ద్వారా తెలుసుకుని గుర్తించారు. మృతుడి భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఉద్యమకారుడి మృతి



కనకయ్య (ఫైల్‌)

గజ్వేల్‌రూరల్‌: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమకారుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గజ్వేల్‌ మండలం ధర్మారెడ్డిపల్లిలోని నిరుపేద కుటుంబానికి చెందిన కాసమొల్ల కనకయ్య ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఏ కార్యక్రమం జరిగినా చురుగ్గా పాల్గొన్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

ఆర్థిక సాయం:



ఆర్థికసాయం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్‌ మాదాసు శ్రీనివాస్‌

గజ్వేల్‌ ఏఎంసీ చైర్మన్‌ మాదాసు శ్రీనివాస్‌ విషయం తెలుసుకొని గురువారం బాధిత కుటుంబానికి రూ. 25వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్‌ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ పార్టీకి కనకయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ జేజేల వెంకటేశం, ఎమ్మెల్సీ డాక్టర్‌ యాదవరెడ్డి, వైస్‌ ఎంపీపీ బెల్దె కృష్ణగౌడ్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు బెండ మధు, జెడ్పీటీసీ మల్లేశం తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్‌, మాధవరెడ్డి, గాలెంక శ్రీను, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్‌ ఢీ..మైనర్‌ మృతి

- మరో బాలుడికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం



శ్రీమాన్‌ (ఫైల్‌)

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ ఆటో ఢీ కొన్న ఘటనలో బాలుడు మృతిచెందడంతో పాటు మరో బాలుడికి తీవ్ర గాయలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు, సిద్దిపేట వన్‌ టౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నాసర్‌పురాకు చెందిన తరిగొప్పుల శ్రీమాన్‌ (16), రేషం దివేంద్ర (18)లు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిద్దరూ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్‌ చదువుతున్నారు. గురువారం సాయంత్రం శ్రీమాన్‌, దివేంద్రలు ముస్తాబాద్‌ చౌరస్తా నుంచి పుల్లూరు వైపు వెళుతుండగా నిమ్రా గార్డెన్‌ ఎదురుగా, భారత్‌ పెట్రోలియం వద్ద ఆటోను వీరు ప్రయాణిస్తున్న బైక్‌ వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో శ్రీమాన్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. దివేంద్ర తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన దివేంద్రను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌ టౌన్‌ సిఐ బిక్షపతి తెలిపారు.



ప్రమాదానికి గురైన బైకును ఆటోలో పోలీస్‌ స్టేషన్‌కు తరలిస్తున్న సిబ్బంది

మందుబాబులకు జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని పలు చౌరస్తాల్లో వారం రోజుల క్రితం తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ గురువారం పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన సిద్దిపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు రూ.46,500లు జరిమానా విధించారు. ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఓటు వేద్దాం ఇలా...

ఓటు ఏ విధంగా వేయాలి. ఈవీఎంలను ఎలా ఉపయోగించాలో గ్రామీణ, పట్టణ ఓటర్లకు ఎన్నికల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని నర్సాపూర్‌లో ఎన్నికల అధికారులు ఓటర్లను ఇలా నిలబెట్టి ఓటు వేయిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది .

–కె.సతీశ్‌, సాక్షిస్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట



క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన తన్వీర్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న తన్వీర్

జహీరాబాద్‌: రాష్ట్ర మున్సిపల్‌ శాఖ మంత్రి కేటీఆర్‌ను టీఎస్‌ఐడీసీ చైర్మన్‌ ఎండీ తన్వీర్‌ గురువారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా నియమితులైనందుకు గాను ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు తన్వీర్‌ చెప్పారు.

ఫాంప్లాట్లలో జెండాల తొలగింపు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎర్దనూర్‌ శివారులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫాంప్లాట్లలో గురువారం పంచాయతీ అధికారులు జెండాలను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాణిక్యం మాట్లాడుతూ మండలం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నందునా కొత్తగా ఏర్పాటు చేసే వెంచర్లు, ఫాంప్లాట్లకు హెచ్‌ఎండీఏ అనుమతి తప్పకుండా ఉండాలన్నారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే కూల్చి వేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యుడు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్‌ కార్యాలయంలో సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ సుజాత మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో పరిసరాల శుభ్రత, సీజనల్‌ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి



యువకులతో నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): యువత అన్ని రంగాల్లో ముందుండాలని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నేత, చిట్కుల్‌ సర్పంచ్‌ నీలం మధు అన్నారు. మండలంలోని లక్ష్మీపతిగూడెం గ్రామానికి చెందిన యువకులకు క్రికెట్‌, వాలీబాల్‌ కిట్లను గురువారం అందజేశారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. గ్రామాల్లో యువకులకు ఎలాంటి సహాయ, సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో యువకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం పబ్లిక్‌ స్కూల్‌ గుర్తింపు రద్దు చేయాలి

జహీరాబాద్‌ టౌన్‌: ఖమ్మంలోని పబ్లిక్‌ స్కూల్‌ గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్‌ కార్యదర్శి రాజేష్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. వామపక్షాల విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మం పబ్లిక్‌ స్కూల్‌ను బంద్‌ చేయడానికి వెళ్లిన వారిపై యాజమాన్యం దాడిచేయించడంతో నిరసనగా గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్‌ మాట్లాడుతూ పబ్లిక్‌ స్కూల్‌ యాజమాన్యంతో పాటు ఇతర ప్రైవేట్‌ పాఠశాలల నిర్వాహకులు కూడా దాడిలో పాల్గొన్నారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రవర్దన్‌, అతిక్‌, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): మండల పరిధిలోని గంగ్వార్‌ చౌరస్తాలోని పలు దుకాణాల్లో ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాలను గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రిజిస్టర్లను పరిశీలించారు.

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): ఫలక్‌నుమా రైలు ప్రమాదంలో పలువురిని కాపాడిన రాజు ఇటీవల అస్వస్థతకు గురయ్యాడు. జిన్నారం మండలంలోని బొల్లారం గ్రామంలో నివాసం ఉంటున్న రాజు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు బీజేపీ నాయకురాలు గోదావరి రూ.10 వేలు, స్థానిక నాయకుడు ఆనంద్‌కృష్ణారెడ్డి రూ.5వేల ఆర్థికసాయాన్ని అందించారు.

గొల్లకురుమల అభివృద్ధికి పెద్దపీట

జహీరాబాద్‌ ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): గొల్లకురుమల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్గి గ్రామంలో గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన గొల్లకుర్మలు అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేపట్టిందన్నారు. ఒక్కప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి మాంసాన్ని దిగుమతి చేసుకున్న మన రాష్ట్రం ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్‌ పెంటారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రవీందర్‌, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవి, సర్పంచ్‌ మారుతియాదవ్‌, ఎంపీటీసీ శివానంద శ్రీపతి, మండల పశు వైద్యాధికారి అజింక్యా, ప్రజాప్రతినిధులు ఇమ్రాన్‌, రాజు, ఇజ్రాయెల్‌ బాబి, మిథున్‌ రాజ్‌, వినోద్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గొర్రె పిల్లలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

డ్రైవింగ్‌ లైసెన్సులకు దరఖాస్తుల స్వీకరణ

జహీరాబాద్‌: ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆధ్వర్యంలో ఉచిత మోటారు డ్రైవింగ్‌ లైసెన్సుల జారీ కోసం దరఖాస్తుల స్వీకరణను గురువారం క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది యువకులు తరలివచ్చి దరఖాస్తులను ఎమ్మెల్యే మాణిక్‌రావు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా డ్రైవింగ్‌ లైసెన్సులను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. లైసెన్సులు లేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

జిన్నారం(పటాన్‌చెరు): రైతుబీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌ సూచించారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో రైతుబీమాకు దరఖాస్తు చేసుకునే విధానంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 30వరకు రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌ శంకర్‌, ఏఈఓ అస్మిత పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్‌): రైతుబీమాకు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పెద్దచల్మెడ వ్యవసాయ విస్తరణ అధికారి రహిమాన్‌ అన్నారు. మండలంలోని పెద్దచల్మెడ రైతువేదికలో తాటిపల్లి, పెద్దచల్మెడ, పిల్లోడి గ్రామాల రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు.

కుర్మ యువత నూతన కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి మున్సిపాలిటీ: మక్తఅల్లూరు గ్రామంలో కుర్మ యువత నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శివకుమార్‌, ఉపాధ్యక్షులుగా రవితేజ, వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా మహేష్‌, కార్యదర్శులుగా జగదీశ్వర్‌, మధు, సహాయ కార్యదర్శులుగా బాలరాజ్‌, నర్సింలు, కోశాధికారిగా అనిల్‌, సలహాదారులుగా మల్లేశంను నియమించినట్లు కుర్మ యువత సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌మార్‌, సీనియర్‌ నాయకులు పోచారం రాములు తెలిపారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల మాజీ డైరెక్టర్‌ నగేష్‌, కుర్మ యువత సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, సంగారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు సోమశేఖర్‌, ప్రధాన కార్యదర్శి రమేష్‌, సంగారెడ్డి నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఇర్గిపల్లి ఉపసర్పంచ్‌ నవీన్‌మార్‌, బీసీ సంఘం నాయకులు రమేష్‌, కుర్మ సంఘం సదాశివపేట సీనియర్‌ నాయకులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని అవర్‌ ఫుడ్‌ పరిశ్రమ కార్మికుల వేతనాలు చెల్లించాలని తెలంగాణ జన సమితి(టీజేఎస్‌) నియోజకవర్గం ఇన్‌చార్జి ఆశప్ప డిమాండ్‌ చేశారు. అవర్‌ఫుడ్‌ పరిశ్రమ కార్మికులతో కలిసి ఆయన గురువారం పస్తాపూర్‌లో కార్మికశాఖ కార్యాలయంలో లేబర్‌ ఆఫీసర్‌ను కలిసి కార్మికులు సమస్యలను వివరించారు. పరిశ్రమ యజమాన్యంతో కార్మికశాఖ అధికారులు మాట్లాడి పెండింగ్‌ వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): మండలంలోని వివిధ పాఠశాలల్లో తపస్‌ సభ్యత్వ కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం మెటల్‌కుంట, కల్బెమల్‌, మామిడ్గి, న్యాల్‌కల్‌ తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. తపస్‌ మండల శాఖ అధ్యక్షుడు శేఖర్‌, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌, జిల్లా కార్యదర్శి తుకారం, మండల బాధ్యులు బాలకృష్ణ, రాజునాయక్‌, సంజీవ్‌ పాల్గొన్నారు.

నాడు సూచిక బోర్డు ఏర్పాటు.. నేడు తొలగింపు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలో అల్లీనగర్‌ గ్రామంలో గ్రామకంఠం భూమిని ఓ పరిశ్రమ యాజమాన్యం కబ్జా చేస్తూ రోడ్డు వేస్తుండటంతో గత నెలలో గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు గ్రామకంఠం స్థలంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇది ఇలా ఉండగా గురువారం ఈఓ నరేష్‌ ఆధ్వర్యంలో గ్రామకంఠం బోర్డును తొలగించారు. గ్రామ పంచాయతీ తీర్మానం అయినప్పటికీ గ్రామకంఠం స్థలాన్ని పరిశ్రమలకు అప్పజెప్పటకు అధికారులు, ప్రజాప్రతినిధులు యత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాడు బోర్డు ఏర్పాటు చేసి.. నేడు తొలగించటంతో అధికారుల తీరుపై గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయిస్తామని స్థానిక నాయకులు చెప్పారు. ఈ విషయంపై ఈఓ నరేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సూచిక బోర్డును తొలగించామని సమాధానం ఇచ్చారు.



బోర్డును తొలగిస్తున్న సిబ్బంది



పటాన్‌చెరు: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఘనంగా బోనాలు

జిల్లా వ్యాప్తంగా గురువారం బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

గడపగడపకు 'యూత్‌ కాంగ్రెస్‌' ప్రారంభం

నారాయణఖేడ్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అమలు చేసే పథకాలను గురించి యువజన కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్‌ తెలంగాణ ఇన్‌చార్జి శంభురాజ్‌ దేశాయ్‌ పిలుపునిచ్చారు. ఈ మేరకు నారాయణఖేడ్‌లో గురువారం టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షులు సురేశ్‌ షెట్కార్‌, డాక్టర్‌ సంజీవరెడ్డి స్వగృహాల ఆవరణల్లో వేర్వేరుగా గడపగడపకూ యూత్‌ కాంగ్రెస్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్‌, యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్‌షెట్కార్‌, జిల్లా ఉపాధ్యక్షులు రాజు, కౌన్సిలర్లు దారం శంకర్‌, రాజేష్‌ చౌహాన్‌, నాయకులు సుధాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, అవుటి శంకర్‌, పల్లవి పరశురాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీఆర్‌ఎస్‌ శ్రేణుల నిరసనలు

రాయికోడ్‌(అందోల్‌): రైతులకు ఉచిత విద్యుత్‌ సరఫరాపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం బీఆర్‌ఎస్‌ శ్రేణులు రాయికోడ్‌లోని విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజ్‌పాటిల్‌, శంకర్‌, ఆత్మకమిటీ చైర్మన్‌ విఠల్‌, వరము సంఘం ఉపాధ్యక్షుడు తుకారం, ఎంపీటీసీ పండరి, నాయకులు హన్మంత్‌రావు, మల్లేశం, నరేష్‌ పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌: బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వరకు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో ప్రదర్శన నిర్వహించి దహనం చేశారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రుబీనా నజీబ్‌, వైస్‌చైర్మన్‌ పరశురాం, బీఆర్‌ఎస్‌ మండల, పట్టణ అధ్యక్షులు పరమేశ్వర్‌, నగేష్‌, రైబస అధ్యక్షులు సత్యపాల్‌రెడ్డి, కోఆప్షన్‌ సభ్యులు నవాబ్‌ పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్‌): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం మండల ప్రజా పరిషత్‌ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్మికులు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు.

వట్‌పల్లి(అందోల్‌): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జోగిపేట పట్టణంలోని అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట గురువారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వట్‌పల్లి, అందోల్‌ మండలాల్లో విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ల ఎదుట రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. అందోల్‌–జోగిపేట మున్సిపల్‌ చైర్మన్‌ మల్లయ్య, వైస్‌చైర్మన్‌ ప్రవీణ్‌కుమార్‌, ఎంపీపీ బాలయ్య, రాయికోడ్‌ జెడ్పీటీసీ మల్లికార్జున్‌ పటేల్‌, వరం అధ్యక్షుడు వీరారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్‌ సిద్దన్నపాటిల్‌, సర్పంచ్‌ లింగన్న, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పుల్‌కల్‌(అందోల్‌): మండల పరిధిలోని విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ల వద్ద బీఆర్‌ఎస్‌ శ్రేణులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్‌చారి, మంజులవీరారెడ్డి పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: రైతులపై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు టీఎస్‌టీసీ చైర్మన్‌ చింతా ప్రభాకర్‌ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద కాంగ్రెస్‌ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి, సీడీసీ చైర్మన్‌ బుచ్చిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్‌ నరహరిరెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ప్రభుగౌడ్‌ పాల్గొన్నారు.

మనూరు(నారాయణఖేడ్‌): బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు విఠల్‌రావు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, బాదల్‌గాం, అతిమ్యాల్‌, మాయికోడ్‌ సర్పంచ్‌లు నాగుపటేల్‌, నర్సింలు, సుధాకర్‌, నాగేందర్‌, బీఆర్‌ఎస్‌ యూత్‌ మండల నాయకులు బీరాదర్‌ శివశంకర్‌, మల్లేశం, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ మన్నాన్‌ పాల్గొన్నారు.



వట్‌పల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌



సంగారెడ్డి మున్సిపాలిటీ: ఐబీ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



నారాయణఖేడ్‌: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో ప్రదర్శన నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్‌ శ్రేణులు

ఫ్లెక్సీలలో మా ఫొటోలు ఎందుకు పెట్టలేదు?

సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్ల నిలదీత

వట్‌పల్లి(అందోల్‌): ఇటీవల ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో మా ఫొటోలు ఎందుకు పెట్టలేరంటూ కౌన్సిలర్లు సభను నిలదీశారు. గురువారం అందోలు–జోగిపేట మున్సిపల్‌ చైర్మన్‌ మల్లయ్య అధ్యక్షతన మున్సిపల్‌ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండా అంశాల్లో పొందుపరిచిన అంశాలపై సాదాసీదాగా చర్చను కొనసాగించి ఆమోదం తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో సరిగా చర్చ జరగకుండానే సమావేశాన్ని త్వరగా ముగించడంపై కాంగ్రెస్‌ కౌన్సిలర్‌లు అభ్యంతరం తెలిపారు. ఎజెండాలో పొందపరిచిన 36 అంశాలకు 35 అంశాలకు మాత్రమే సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీలోని 20 వార్డులకు వార్డుకు రూ.2లక్షల చొప్పున సీసీ ఏర్పాటు చేసేందుకు నిధులను కేటాయించారు. శానిటేషన్‌, తాగునీటి సమస్య, వీధిదీపాల ఏర్పాటు వంటి వాటిపై దృష్టి సారించాలని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో కమిషనర్‌ తిరుపతయ్య, వైస్‌చైర్మన్‌ ప్రవీన్‌, కౌన్సిలర్లు దుర్గేష్‌, పవన్‌, మాధవి, భారతి, భవాని, చిట్టిబాబు, రేఖ, హరికృష్ణగౌడ్‌, రంగ సురేష్‌,భాగ్యలక్ష్మీ, సుమిత్ర పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు, సభ్యులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్‌ టౌన్‌: విలువైన మున్సిపల్‌ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జహీరాబాద్‌ డివిజన్‌ కార్యదర్శి నర్సింలు డిమాండ్‌ చేశారు. సీపీఐ నాయకులతో కలిసి కబ్జాకు గురైన స్థలాన్ని గురువారం పరిశీలించి మున్సిపల్‌ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ పట్టణంలోని శాంతినగర్‌ నెంబర్‌ 5 ప్రభుత్వ పాఠశాల పక్కనే వాటర్‌ట్యాంక్‌, ఓపెన్‌ వెల్‌తో పాటు ఖాళీ స్థలం ఉండగా స్థలం కబ్జాకు గురైందన్నారు. ప్రస్తుతం ఓపెన్‌ వెల్‌ను సైతం కబ్జా చేస్తున్నారన్నారు. బావిని మట్టితో పూడ్చి అక్కడ నిర్మాణం పనులు చేపట్టేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. విలువైన స్థలాలు కబ్జాకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా యల్లలింగ మహాప్రభు జయంతి**

నారాయణఖేడ్‌: నారాయణఖేడ్‌లోని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ సంజీవరెడ్డి స్వగృహ ఆవరణలో గురువారం కర్ణాటక పుణ్యక్షేత్రమైన ముక్తిమందిరం మొగుల్‌ఖేడ్‌కు చెందిన సద్గురు యల్లలింగ మహాప్రభు మహారాజ్‌ జయంతిని నిర్వహించారు. యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర ఇన్‌చార్జి శంభోరాజ్‌దేశాయ్‌, జిల్లా, స్థానిక నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజు, పల్లవి పరశురాం, శ్యాంప్రసాద్‌, శ్రీకాంత్‌, శంకర్‌, రాజేష్‌ చౌహాన్‌, హన్మండ్లు పాల్గొన్నారు.

◆ **సెక్టోరల్‌ స్కిల్స్‌ కోర్సు ప్రారంభం**

పటాన్‌చెరు టౌన్‌: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కమిషనర్‌ కళాశాల విద్యాశాఖ నూతనంగా సెక్టోరల్‌ స్కిల్స్‌ కోర్సుగా బీబీఏ కోర్సును 60 సీట్లతో మంజూరు చేసిందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ రాజన్నప్రసాద్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లాస్‌ రూమ్‌ టీచింగ్‌తో పాటు ఇండస్ట్రీలో అప్రెంటిస్‌ షిప్‌ ఉంటుందన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌ దోస్త్‌ ద్వారా ఈ నెల 14లోపు రిజిస్ట్రేషన్‌ చేయించుకొని అడ్మిషన్‌ పొందాలని సూచించారు.

◆ **నేడు బోనాలు**

మునిపల్లి(అందోల్‌): మండలంలోని తాటిపల్లి, మక్తక్యాసారం, పిల్లోడి గ్రామాల్లో ఈ నెల 14వ తేదీన బోనాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **18నుంచి చండీయాగం**

నారాయణఖేడ్‌: ఖేడ్‌లోని సత్యసాయికాలనీలోని మహతి జ్యోతిష్యాలయంలో మలమంచి గురురాజ్‌ శర్మ ఆధ్వర్యంలో అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి నెలరోజుల పాటు చండీయాగాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గురువారం రుబీనానజీబ్‌ సందర్శించి ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

◆ **8వ రోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె**

రాయికోడ్‌(అందోల్‌): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారంతో 8వ రోజుకు చేరుకుంది. సమ్మెకు సీఐటీయూ నాయకులు దశరథ్‌ మద్దతు తెలిపారు. కార్మికులు అంజన్న, సత్తయ్య, నిరంజన్‌, నాగన్న, దేవదాస్‌ పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల స్వీకరణ**

వట్‌పల్లి(అందోల్‌): అందోల్‌ కేజీబీవీలో వంట మనిషి కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు స్పెషల్‌ ఆఫీసర్‌ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వంట మనిషి పోస్టు ఖాళీగా ఉందన్నారు. పదో తరగతి అర్హతతో పాటు 20 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి వంట చేయడంలో అనుభవం ఉండాలన్నారు. ఈ నెల 14న సాయంత్రం 5గంటల వరకు బయోడేటాతో పాటు ఫొటో, నివాస ధ్రువపత్రం, సంబంధిత సర్టిఫికెట్లను జత చేసి కేజీబీవీలో అందజేయాలని సూచించారు.

◆ **రైతుల అభివృద్ధికి కృషి**

మునిపల్లి(అందోల్‌): రైతులు అభివృద్ధికి కాంగ్రెస్‌ పార్టీ కృషి చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా కూతురు త్రిష అన్నారు. గురువారం మండలంలోని ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పెద్దచల్మెడ ఎంపీటీసీ రాధాబాయిజోషి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు సతీష్‌కుమార్‌, నాయకులు పాల్గొన్నారు.

◆ **తహసీల్దార్‌కు ముంపు బాధితుల ఫిర్యాదు**

పుల్‌కల్‌(అందోల్‌): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామంలో ముంపు బాధితులకు కేటాయించిన భూమిని మరొకరు పట్టా చేసుకున్నారని గ్రామస్తులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ విచారణ చేపట్టి న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీనిచ్చారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్‌ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్‌ పుష్పనగేష్‌ అన్నారు. గురువారం డివిజన్‌ పరిధిలోని సాయినగర్‌కాలనీలో అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్‌, నాయకులు కుమార్‌గౌడ్‌, జగన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాసనగర్‌కాలనీలో బాలవిహార్‌ పార్కును సందర్శించారు. పార్కును పూరిస్థాయిలో అభివృద్ధి చేస్తామని పుష్పనాగేష్‌ తెలిపారు.

◆ **విద్యార్థులకు కంటి పరీక్షలు**

వట్‌పల్లి(అందోల్‌): జోగిపేట పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌లో విజన్‌ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం 250 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటివైద్య నిపుణులు మహేందర్‌, షెడ్రక్‌, ప్రిన్సిపాల్‌ ప్రణీతరెడ్డి, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని కాలనీలలో సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్‌ సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య కాలనీలో సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఉదయ్‌కుమార్‌, ఉపాధ్యక్షులు కిషోర్‌, కాలనీవాసులు పాల్గొన్నారు

◆ **విరాళం అందజేత**

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకూర్‌ మండలంలో శివంపేట గ్రామంలో గురువారం హనుమాన్‌ దాతల విరాళాలతో ఆలయానికి రూ.66 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ అందజేశారు. ఇందులో సర్పంచ్‌ పట్లోల రాజిరెడ్డి రూ.51వేలు, ఊట్ల శ్రీనివాస్‌రెడ్డి రూ.11వేలు, విశంబి వెంకటేష్‌వర్మ రూ.5వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ రాజిరెడ్డి, ఉప సర్పంచ్‌ దశరథ్‌, ఎంపీటీసీ కిరణ్‌గౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లికార్జున్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ **మొక్కలను నాటాలి**

మునిపల్లి(అందోల్‌): ఉపాధిహామీ పథకంలో మొక్కలు నాటాలని ఎంపీడీఓ హరినందర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని పొల్కంపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కూలీలు పాల్గొన్నారు.

◆ **ఆటోడ్రైవర్లకు హెల్త్‌ కార్డుల పంపిణీ**

హత్నూర (సంగారెడ్డి): సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హోప్‌ న్యూరో హాస్పిటల్‌ సహకారంతో గురువారం మండలంలోని షేర్ఖాన్‌ పల్లి గ్రామంలో ఆటోడ్రైవర్లకు ఉచితంగా హెల్త్‌ కార్డులను దొంతి సంతోష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శివశంకర్‌రావు, బీఆర్‌ఎస్‌ నాయకులు మహమ్మద్‌ హుస్సేన్‌, రామకృష్ణ పాల్గొన్నారు.

◆ **రైతుబీమా దరఖాస్తుల్లో మార్పులకు అవకాశాలు**

సంగారెడ్డి టౌన్‌: రైతుబీమాకు దరఖాస్తులలో రైతులకు ఏదైనా మార్పులు ఉన్నట్లయితే ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.